క్లుప్తంగా

హ్యాండ్ రైటింగ్‌పై పోటీలు



అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కలెక్టర్ ఆదేశానుసారం విద్యార్థులకు హ్యాండ్‌రైటింగ్‌పై మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత, కేజీబీవీలకు సంబంధించిన విద్యార్థులు ముగ్గురు చొప్పున పోటీల్లో పాల్గొన్నారు. కేజీబీవీ పదో తరగతి విద్యార్థిని వి.రేణుక మండలస్థాయిలో ప్రథమ, సిరిసేడు జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థి బొంగోని చైతన్య ద్వితీయ, జడ్పీహెచ్‌ఎస్ ఇల్లందకుంట తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.రచన తృతీయస్థానంలో నిలిచారు. అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి హ్యాండ్‌రైటింగ్ పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థులను ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో మండ విద్యాధికారి కె.రాములు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎండీ.తస్మీన్‌నజ్మీమ్, వేణు, సత్యం, వేణుగోపాలచారి, పద్మ, కిషన్‌నాయక్, ప్రసాద్, ఉమాదేవి, జయపాల్‌రెడ్డి, సమ్మిరెడ్డి, రాధికరాణి, సురేశ్, శంకర్, ఐలయ్య, ఉమాదేవి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరనిలోటు



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: సీపీఐ సీనియర్ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పార్టీ మండల కార్యదర్శి చొక్కళ్ల శ్రీశైలం అన్నారు. సోమవారం గన్నేరువరంలో ఆయన చిత్రపటానికి నాయకులతో కలిసి నివాళి అర్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి చరిత్రలో పట్టభద్రులయ్యారని, విద్యార్థి దశ ఉంచి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారని, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ వంటి విద్యార్థి యువజన సంఘాల్లో పనిచేశారని, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమల్లో ఆయన పాత్ర కీలకమని పేర్కొన్నారు. వరద కాల్వ కోసం అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు అంజిరెడ్డి, మండల సహాయ కార్యదర్శులు మల్లయ్య, కనకయ్య, ఎల్లయ్య, గోపయ్య, నయూమ్, గ్రామశాఖ కార్యదర్శులు తిరుపతి, మల్లయ్య, యువజన సంఘం నాయకులు అంజనేయులు, లింగం, గణేశ్, సహాయ కార్యదర్శి అంజయ్య, చారి, రవి పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐ, తదితరులు

జమ్మికుంట: పట్టణంలో అడ్తిదారులు సంఘం భవనంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని టౌన్ సీఐ రామకృష్ణ ఆవిష్కరించారు. నేత్రదానంతో అంధులకు చూపు అందించడం గొప్ప విషయమన్నారు. మంచి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, వ్యాపారులు బచ్చు భాస్కర్, మనోహర్, ముక్కా శ్రీనివాస్, ఫౌండేషన్ నిర్వాహకులు నరహరి పాల్గొన్నారు.

బావిలో పడిన వృద్ధురాలిని రక్షించిన ఫైర్ సిబ్బంది

చొప్పదండి: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన భాగ్యలక్ష్మి(65)లు సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు చేదబావిలో పడిపోగా అగ్నిమాపకశాఖ సిబ్బంది రక్షించారు. అనుకోకుండా బావిలో పడటంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ పవన్ ఆధ్వర్యంలో సిబ్బంది నరేందర్, శశికుమార్, గణేశ్, సత్తయ్య, అరుణ్ కుమార్ వృద్ధురాలిని బావిలో నుంచి బయటకు తీశారు. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నార్మల్ డెలివరీ



వీణవంక: మండలంలోని చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రాత్రి మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళకు వైద్యులు సుఖప్రసవం చేశారు. పుట్టిన బిడ్డ 2.3 కేజీల బరువు ఉందని, తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్ సుచిత్ర తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు హారిక, ఏఎన్‌ఎం విజయ, ప్రమీల, ఆశ, సాధన ఉన్నారు.

మట్టి విగ్రహాలు పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం



జమ్మికుంట: మట్టి గణపతి విగ్రహాలతో విద్యార్థులు



హుజూరాబాద్: మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించవద్దని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లారెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

జమ్మికుంట: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.రమేశ్ అన్నారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ గణేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ రాజేంద్రం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎంబాడి రవి, లోఖండె రవీందర్, అధ్యాపకులు శ్యామల, మాధవి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మమత, సుష్మ, రవిప్రకాశ్, శ్రీనివాస్, రమేష్, ప్రశాంత్, సాయి, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానకొండూర్: మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దామని జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల తయారీ వర్క్‌షాపును సందర్శించి విద్యార్థులను అభినందించారు. మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని సూచించారు. టీచర్లు శ్రీనివాస్, కొండ శైలజ, జయేందర్‌రెడ్డి, కూర శ్రీనివాస్, మమత, శ్రీవాణి, శైలజ, పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని అవగాహన కల్పించారు. మట్టి విగ్రహాలు తయారు చేసిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అభినందించారు.



రామడుగు: గోపాల్‌రావుపేటలో..

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు స్వీకరించండి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌అర్బన్: ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరైనా కొత్తగా దరఖాస్తులు ఇస్తే స్వీకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఇళ్లు మంజూరై నిర్మించేందుకు సుముఖత వ్యక్తం చేయని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన దరఖాస్తుదారులకు ఇల్లు కేటాయించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి అనంతరం అధికారులతో మాట్లాడారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ దశలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. 15 ఏళ్లు నిండిన బాలికలు, 50 ఏళ్లు పైబడిన మహిళలు, దివ్యాంగులను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని డీఆర్‌డీవో, మెప్మా పీడీలను ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో చదివే బాలికలను ఈ సంఘాల్లో చేర్పించాలన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబి పండగల నేపథ్యంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు రానున్న వారం రోజుల్లో అన్ని ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించి నివేదిక సమర్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఓటు వేయాలని వేడుకుంటేనే గెలిచావు

- బీఆర్‌ఎస్ నాయకులపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని పెద్ద నాయకులను విమర్శిస్తే నాయకుడివి కావు అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి ఇప్పుడు కేటీఆర్, హరీశ్ రావులపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఇదే చివరి అవకాశమని దండం పెడుతూ ఓటు వేయాలని వేడుకుంటేనే ప్రజలు గెలిపించారని, అభివృద్ధి పనులు చేసి వారి రుణం తీర్చుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా నిధులు తీసుకురావడం చేతకావడం లేదని, మంజూరైన పనులనైనా పూర్తి చేయించాలన్నారు. కాంగ్రెస్ చేపట్టింది జనహిత యాత్ర కాదని జనంలేని యాత్ర అని, నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కనిపించకపోతే కాంగ్రెస్ నాయకులకు చూపిస్తామన్నారు. సమావేశంలో నాయకులు నవీన్‌రావు, సాగి మహిపాల్‌రావు, కంకణాల విజయేందర్‌రెడ్డి, ఉప్పుల గంగాధర్, వేముల దామోదర్, జోగు లక్ష్మీరాజం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిశంకర్, నాయకులు

దివ్యాంగుల పాఠశాలకు రూ.50 లక్షల గ్రాంట్

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలోని ఫ్రీడమ్ ఫైటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు ప్రభుత్వం రూ.50 లక్షల గ్రాంట్ విడుదల చేసిందని ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ నుంచి ఏటా గ్రాంట్-ఇన్-ఎయిడ్ అందుతుందని, 2024–25 ఏడాదికి గ్రాంట్ అందలేదన్నారు. పాఠశాల ఆర్థిక పరిస్థితి, సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశామన్నారు. ప్రభుత్వం దరఖాస్తును పరిగణనలోకి తీసుకొని పాఠశాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మేనేజింగ్ ట్రస్టీ బి.వెంకటయ్య, ట్రెజరర్ జి. కొమురెల్లారెడ్డి, ట్రస్ట్ సభ్యులు జి. భగవాన్, డాక్టర్ ఎల్. మధుసూదన్ రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాలరాజు, ప్రిన్సిపాల్ ఎస్.సతీష్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

దాడి చేసినవారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

తిమ్మాపూర్: బాలయ్యపల్లెలో దళితులపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళితులపై నాయకుల దాడిని ఖండించారు. పోలీసులు కేసు నమోదు చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు వంతడుపుల సంపత్, గోదారి సంతోష్, దుర్గ అశోక్, గోదారి వసంత, గోలి స్వరూప, దుర్గం జగన్నాథం, దుర్గం నారాయణ, గోదారి హరిప్రియ, కెమెరా శోభ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

మహేశ్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మ దహనం





హుజూరాబాద్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, శంకరపట్నంలో...

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో సోమవారం బీజేపీ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాన రోడ్లపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. పలుచోట్ల దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు అడ్డుకొని నాయకులు, కార్యకర్తలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. బండి సంజయ్‌కుమార్ గారిని విమర్శిస్తే ఊరుకోమని మహేశ్‌కుమార్‌గౌడ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చేసేంది జనహిత యాత్ర కాదని పిచ్చియాత్ర అని పేర్కొన్నారు. హామీలను నెరవేర్చకుండా, ప్రజల కోసం అంకిత భావంతో పని చేస్తున్న కేంద్ర మంత్రిని విమర్శించడం కాంగ్రెస్ చేతకాని తనమని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

సాక్షి స్పందన

వీణవంక: బేతిగల్ గ్రామంలో జాండీస్ వ్యాధి వ్యాప్తిపై ఈ నెల 17న సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఎన్‌పీబీడీసీపీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు సోమవారం గ్రామంలో సందర్శించారు.ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వ్యాధులు ప్రబలుతున్నందున పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా బేతిగల్‌లోని ఓ ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారు. వారం రోజులుగా గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నారు. వ్యాధి అదుపులో ఉందని ప్రజలు భయపడొద్దని వైద్యాధికారి వరుణ తెలిపారు.

కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు మెమో జారీ

శంకరపట్నం: కేశవపట్నం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవికి డీఈవో మెమో జారీ చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కేజీబీవీని సందర్శించినప్పుడు వంట మనుషులు కూరలు రుచిగా లేవంటే తిడుతున్నారని ఏడుస్తూ చెప్పడంతో ఇద్దరు వంట మనుషులను అధికారులు తొలగించారు. నాలుగు రోజుల క్రితం తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులను ఎలుకలు కొరకడంతో డీఈవో మండల అధికారులతో విచారణ చేయించారని, బాధ్యురాలైన మాధవికి డీఈవో మెమో జారీ చేశారని ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.

ఈజీఎస్ గ్రామసభలు



చీమలకుంటపల్లెలో గ్రామసభ

గన్నేరువరం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన వివిధ పనులపై ఎస్‌ఆర్పీ తిరుపతి ఆధ్వర్యంలో గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టారు. మండల వ్యాప్తంగా సుమారు రూ.4 కోట్ల పనులు చేపట్టగా, ఎస్‌ఆర్పీ బృందం సభ్యులు గ్రామాల వారీగా కూలీలు, గ్రామస్తుల సమక్షంలో గ్రామ సభలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం చీమలకుంటపల్లె, గునుకులకొండాపూర్, హన్మాజిపల్లె గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మిగతా గ్రామాల్లో సభలు నిర్వహించిన అనంతరం సెప్టెంబర్ 1న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోషల్ ఆడిట్ నిర్వహించనున్నామని మండల పరిషత్ అధికారులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ

గంగాధర: గంగాధర మండలానికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ అంబటి రజిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ అనుపమరావు వీణవంక మండలానికి బదిలీపై వెళ్లారు. వీణవంక నుంచి రజిత గంగాధరకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన బండ నరేందర్‌ను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ మండలాధ్యక్షుడిగా నియామకమయ్యారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఇల్లందకుంట: మండలంలోని పలు సమస్యలపై బీజేపీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి సీహెచ్.నరసింహరాజు హాజరయ్యారు.

హుజూరాబాద్‌రూరల్: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు చెల్పూర్ గ్రామంలో బీజేపీ నాయకులు పర్యటించారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొమురయ్య అన్నారు.

గన్నేరువరం: గన్నేరువరంతో పాటు జంగపల్లి, పారువెల్ల, గుండ్లపల్లిలోని లోలెవల్ కల్వర్టుల వద్ద వెంటనే హైలెవల్ బ్రిడ్జీలు నిర్మించాలని బీజేపీ నాయకులు, కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని నెలకొన్న వివిధ సమస్యలపై పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ప్రణీత్‌కు వినతిపత్రం అందజేశారు.



ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు నుంచి మల్యాల ప్రధాన రోడ్డు వరకు బీటీ రోడ్డు గుంతలమయంగా తయారైంది. వాహనదారులు, ప్రయాణికులు, రైతులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఏళ్లుగా రోడ్డు మరమ్మతుకు నోచుకోక అధ్వానంగా ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శివకుమార్, పంచాయతీరాజ్ ఏఈ : సెల్ నం 6301538145

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కాంగ్రెస్ నేతలకు ఘన స్వాగతం

శంకరపట్నం: ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనహిత యాత్రకు వెళ్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌ను సోమవారం శంకరపట్నంలో స్థానిక నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌తో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి మహేశ్‌కుమార్‌గౌడ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. లింగాపూర్ గ్రామానికి చెందిన కోడూరి సమ్మయ్య ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. అగ్రనేతలు మండలానికి రాగా భద్రత కల్పించడంలో పోలీసుల డొల్లతనం కనిపించింది. అగ్రనేతలు రాకముందే అంబేడ్కర్ విగ్రహం స్టాండ్‌పై ఉన్న సమ్మయ్యను పోలీసులు కిందికి దించకపోవడంతో నాయకులు పోలీసుల తీరుపై మండిపడ్డారు.

హుజూరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, నాయకులకు హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఘన స్వాగతం పలికారు.

మానకొండూర్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, ఇతరులకు మండల కేంద్రంలో నాయకులు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు, బొకేలు, శాలువాలతో సన్మానించారు.



శంకరపట్నం: గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఫిర్యాదు చేస్తే డబ్బులివ్వడట

- ధాన్యం డబ్బుల కోసం ఓ రైతు పాట్లు

కరీంనగర్ అర్బన్: అదేంటీ.. ధాన్యం కొనుగోళ్ల సీజన్ అయిపోయి మూడు నెలలు గడుస్తుండగా డబ్బులు రాకపోవడమేంటనేగా మీ సందేహం. అవునండీ సీడ్ మిల్లు అక్రమంపై ఫిర్యాదు చేసినందుకు అధికారులు, మిల్లు యజమాని ఓ రైతును ఇబ్బందిపెడుతున్న వైనమిది. కరీంనగర్ కలెక్టరేట్‌లో పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా కంటితుడుపు చర్యలే తప్ప.. డబ్బులు రాకపోవడం ఉన్నతాధికారుల పర్యవేక్షణ తీరుకు తార్కాణం. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిని ఆశ్రయించగా ఫిర్యాదు చేస్తే డబ్బులివ్వరా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన చింతల శ్రీధర్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబం. ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలం కాగా జీవనోపాధిగా భూమి కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నారు. హుజూరాబాద్ గణపతి సీడ్స్‌లో 1262 రకం సీడ్ విక్రయించాలని ఏజెంట్ బొల్లపల్లి శ్రీనివాస్ చెప్పడంతో యాసంగి వడ్లను విక్రయించాడు. రెండు ట్రాక్టర్ల వడ్లు విక్రయించగా తూకంలో అనుమానం రావడంతో రెండో ట్రాక్టర్‌ను మరో వే బ్రిడ్జి వద్ద తూకం వేసి తదుపరి సీడ్ కాంటా వద్ద తూకం వేశాడు. దీంతో 50కిలోల తేడా రావడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో అధికారుల వల్ల తనకు చాలా ఇబ్బంది అయిందని, రూ.లక్ష వరకు ఖర్చయిందని సీడ్స్ యజమాని డబ్బులు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. 'నీ దిక్కున్న చోట చెప్పుకో' అని దబాయిస్తున్నాడని, అధికారులకు ఫిర్యాదు చేస్తే చలనం లేదని శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. తూకంలో మోసంపై ఫిర్యాదు చేయడమే తాను చేసిన పాపమా..నని ప్రశ్నిస్తున్నారు. రూ.3.50లక్షల కోసం 3 నెలలుగా నిరీక్షిస్తున్నారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని, పెట్టుబడి లేక వానకాలం సీజన్‌లో పంట కూడా సాగు చేయకుండా అధికారుల చుట్టూ తిరుగుతున్నానని కన్నీటిపర్యంతమయ్యాడు.



చింతల శ్రీధర్‌రెడ్డి, బాధిత రైతు

సంక్షిప్త వార్తలు

- **చికిత్స పొందుతూ యువకుడి మృతి**

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పప్పు అనిల్‌కుమార్(30) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనిల్‌కుమార్ చెల్లిపెళ్లి చేయడంతోపాటు ఇంటి నిర్మాణం చేపట్టడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో ఈ నెల 23న అప్పుల బాధ భరించలేక సదాశివపల్లి స్టేజీ సమీపంలో గడ్డిమందు సేవించగా స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

- **ఆర్థికసాయం**

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన వరుకోలు శ్రీనివాస్ మానకొండూర్ సహకార సంఘం పరిధి చెంజర్ల సంఘానికి వచ్చిన లారీ నుంచి ఎరువులు దించే క్రమంలో కిందపడటంతో రెండు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. మానకొండూర్ విశాల సహకార పరపతి సంఘం నుంచి రూ.పదివేలు అందజేశారు. సంఘం పీఏసీ చైర్మన్ గోవిందారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన రైతు ముసపురి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరఫున చైర్మన్ మల్లారెడ్డి రూ.15 వేలు అందించారు. సంఘంలోని రైతులు మృతి చెందితే తక్షణ సాయం కింద నగదు అందిస్తున్నామని తెలిపారు. సీఈవో తిరుపతిరెడ్డి, డైరెక్టర్ మల్లయ్య, ఏలేటి తిరుపతిరెడ్డి, మునిగాల సుధాకర్ గౌడ్, మునిగాల చందు, నారాయణ పాల్గొన్నారు.

- **రోడ్డుపై మొరాయించిన ఆర్టీసీ బస్సు**

జమ్మికుంట: పట్టణంలోని రోడ్డుపై ఆర్టీసీ బస్సు స్టార్ట్‌కాక మొరాయించడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరీంనగర్ నుంచి జమ్మికుంటకు వచ్చిన బస్సు స్టార్ట్ కాకపోవడంతో బస్టాండ్ నుంచి రోడ్డుపైకి నెట్టుకుంటూ వచ్చారు. అయినా బస్సు ఇంజిన్ ఆన్‌కాక రోడ్డుపైనే నిలిచిపోయింది. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో ఫ్లై ఓవర్ మీదుగా హుజూరాబాద్ వెళ్లే బస్సులు బ్రిడ్జి కింది నుంచి వెళ్లాల్సి వచ్చింది. కండీషన్ లేని బస్సులు నడపడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆరోపించారు.

- **తాడికల్ చేరిన ముదిరాజ్ పల్లెబాట**

శంకరపట్నం: ముదిరాజ్‌ల ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు చేపట్టిన ముదిరాజ్ పల్లెబాట సోమవారం మండలంలోని తాడికల్ గ్రామానికి చేరుకుంది. ఈసందర్భంగా ముదిరాజ్ పోరాట సమితి నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సుంకరబోయిన మహేశ్, ప్రధాన కార్యదర్శి రంజిత్, శేఖర్, కుమారస్వామి, భూమ సంపత్,రమేశ్, కరుణాకర్, శ్రీనివాస్,శ్రీకాంత్, సంపత్, ప్రభాకర్, మల్లయ్య పాల్గొన్నారు.